HAPPY GANESH CHATURTHI

ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 30.5
కనిష్ఠం 23.4

ANDHRAJYOTHY

యాదాద్రి భువనగిరి

5

శనివారం 7 సెప్టెంబరు 2024



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	589.90 (311.7412)	2,34,707	2,04,064
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	642.65 (3.86)	13,000	13,000
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173 (42.77)	70,178	1,11,568

చికెన్ ధరలు | లైవ్ : రూ.120 | డ్రెస్ : రూ.176 | స్కిన్‌లెస్ : రూ.200

ఓ బొజ్జ గణపయ్య విఘ్నాలు తీర్చవయ్యా



సకలవిఘ్నాలు తొలగించే గణేశుడి నవరాత్రి ఉత్సవాలు శనివారం మొదలవనున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే ప్రత్యేక అలంకరణలతో మండపాలు సిద్ధంకాగా, వివిధ రూపాల్లోని వినాయక విగ్రహాలను మండపాలకు తరలించారు. శనివారం ఉదయం విగ్రహాల ప్రతిష్ఠ అనంతరం ప్రత్యేక పూజలతో నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది చల్లంగ చూడాలని, పలు కోర్కెల చిట్టాతో గణాధిపతుడిని వేడుకునేందుకు ఉమ్మడి జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

ఇటీవల వరుణుడు కన్నెర్రజేయడంతో వరదలతో నష్టపోయిన తమను ఒడ్డున వేయాలని, ఈ ఏడాదైనా పంటలు పండి ధాన్యపురాశులతో గాదెలు నిండేలా కరుణించాలని అన్నదాతలు ప్రార్థిస్తున్నారు. ఆకాశాన్నంటిన కూరగాయల ధరలు దిగిరావాలని సామాన్యులు, మధ్యతరగతి జీవులు వేడుకుంటుండగా, ప్రభుత్వాలు తమ మొర ఆలకించి వేతనాలు పెంచాలని, పీఆర్‌సీ ప్రకటించాలని ఉద్యోగ, ఉపాధ్యాయులు కోరుతున్నారు. పదేళ్లపాటు ప్రతిపక్షంలో ఉండి అష్టకష్టాలు పడ్డామని, పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, తమకు గుర్తింపు కలిగించేలా ప్రభుత్వ పెద్దల మనసు మారి పదవులిచ్చేలా విఘ్నేశుడు దయ చూపాలని రాజకీయనేతలు వేడుకుంటున్నారు. ఈ ఏడాది కలిసివచ్చేలా ఆశీర్వదించాలని ప్రతిపక్షాల నాయకులు పూజించేందుకు సిద్ధమయ్యారు. తొలి పూజలందుకునే గణేశుడికి తమ మొర విన్నవిస్తే శుభఫలితం కలుగుతుందనే ఆశాభావంతో భక్తులు ఈ గణేశ్ చతుర్థిని భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు సిద్ధమయ్యారు.

» ధాన్యపురాశులు గలగలలాడేలా చూడాలని కర్షకుల వేడుకోలు
» మట్టిగణపతులే మహాగణపతులని పర్యావరణవేత్తల సూచనలు

ధాన్యపురాశులు పండేలా ఆశీర్వదించు స్వామీ

కరువుతో గత ఏడాది వర్షాలు లేక, సాగునీరందక పంటలు ఎండి, వేసిన పైర్లు చేతికందక నష్టపోయిన రైతాంగం ఈ ఏడాది పంటలు బాగా పండి, ధాన్యపురాశులు నిండేలా ఆశీర్వదించాలని కోరుకుంటోంది. ఇటీవల వర్షాల ప్రభావంతో ఏర్పడిన నష్టం నుంచి బయటపడేసి పంటలు చేతికందేలా ఎలాంటి విఘ్నాలు లేకుండా చూడాలని రైతులు ప్రార్థిస్తున్నారు.

పదవుల యోగం కల్పించు స్వామి

గణేశుడి చల్లని చూపులతో పదవీయోగం కల్పించాలని పలువురు అధికారపార్టీ నేతలు ప్రార్థిస్తున్నారు. పదేళ్లపాటు ప్రతిపక్షంలో ఉండి ప్రజాసమస్యలపై పోరాడామని, ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు చేశామని, తమ కష్టాన్ని ప్రభుత్వ పెద్దలు గుర్తించేలా విఘ్నేశ్వరుడు ప్రేరణ కల్పించి పదవీయోగం కల్పించాలని ఆశావహులు ప్రార్థన చేస్తున్నారు. గత ఏడాది ఆశించిన ఫలితాలు దక్కించుకోలేకపోయామని, తమ కష్టాన్ని గుర్తించి ప్రజలు మద్దతుగా ఉండేలా ఆశీర్వదించాలని తొలి పూజలందుకునే గణేశుడిని ప్రతిపక్ష నాయకులు వేడుకుంటున్నారు.

చుక్కలనంటిన ధరలను తగ్గించు దేవా..

కూరగాయలు, వంటనూనెలు, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశన్నంటడంతో మూడుపూటలా కడుపునిండా భోజనం కూడా చేయలేని పరిస్థితి ప్రస్తుతం నెలకొంది. ఈ ధరలను దించి గణేశుడు దయచూపాలని మధ్యతరగతి, సామాన్యులు వేడుకుంటున్నారు. చారెడు జీతం, బారెడు ఖర్చులతో జీవనం గడ్డుగా మారిన పరిస్థితుల నుంచి ఒడ్డున పడేయాలని కోరుతున్నారు.

కాలుష్యరహితంగా వేడుకలు నిర్వహించాలి

లోక కల్యాణం కోసం నిర్వహించే వినాయకచవితిని కాలుష్యరహితంగా నిర్వహించేలా ఏటా ప్రజల్లో చైతన్యం పెరుగుతోంది. గణేశ్ విగ్రహాల ప్రతిష్ఠలో పీవోపీ (ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్) ప్రతిమల స్థానంలో మట్టిగణపతి విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. పలు స్వచ్ఛంద సంస్థలు, జనవిజ్ఞానవేదిక లాంటి సంస్థలు మట్టివినాయకుల ఆవశ్యకతను, పీవోపీ బొమ్మలతో ఏర్పడే కాలుష్యంపై అవగాహన కల్పిస్తున్నాయి. ప్రధానంగా పీవోపీ గణేశ్ ప్రతిమలతో నీటి కాలుష్యం ఏ స్థాయిలో ఉంటుంద నే అంశంపై అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటికే అంతంతమాత్రంగానే జలవనరులు ఉన్న జిల్లాలో పీవోపీతో తయారుచేసిన గణేశ్ ప్రతిమలు ఎంతో హానికరమైనవని, ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్, సింథటిక్ కలర్స్‌తో చేసిన విగ్రహాలను చెరువుల్లో, నదుల్లో కలపడం వల్ల (నిమజ్జనం చేయడం)ఆ జలాలు కలుషితమవుతున్నాయని పేర్కొంటున్నారు. ప్రధానంగా పీవోపీలో 300 డిగ్రీల ఫారెన్‌హీట్ వద్ద జిప్సంను వేడి చేసి తయారు చేస్తారని, ఇది నీటిలో కలిసినప్పుడు మళ్లీ జిప్సంగా మారుతుందని, ఇది చాలా ప్రమాదకరమని పేర్కొంటున్నారు. మరోవైపు విగ్రహాలకు రంగులు వేస్తున్న కలర్‌లో విషపూరిత భారీ లోహాలుంటున్నాయని, ఇవి కూడా పర్యావరణానికి హాని చేస్తున్నాయని పర్యావరణ శాస్త్రవేత్తలు ఆవేదన చెందుతున్నారు. పీవోపీ విగ్రహాల తయారీలో ఉపయోగించే కలర్‌లో జిప్సమ్, సల్ఫర్, పాస్ఫరస్, మెగ్నీషియం, మెర్క్యురీ, లెడ్, కాడ్మియమ్, ఆర్సెనిక్, కార్బన్, వంటి రసాయనాలతో క్యాన్సర్ సోకే ప్రమాదముందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వినాయక విగ్రహాలను కాలుష్యరహిత బంకమట్టితో, సహజ రంగులైన పసుపు, కుంకుమ, గంధం, బియ్యంపొడితో తయారుచేసుకోవాలని సూచిస్తున్నారు.



జిల్లాలో సుమారు 3వేల విగ్రహాలు

భువనగిరి టౌన్: వినాయక చవితి సందర్భంగా జిల్లాలో సుమారు 3వేలకు పైగా విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. నవరాత్రుల పేరిట నిర్వాహకులు సుమారు రూ.20కోట్లకు పైగా ఖర్చు చేయనున్నారు.


మట్టిగణపతే గట్టి గణపతి



వినాయక చవితిని కాలుష్యరహితంగా జరుపుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. పీవోపీ, రసాయనాలుండే రంగులతో గణేశ్ బొమ్మలను ప్రతిష్ఠించడం, మళ్లీ వాటిని నీటిలో నిమజ్జనం చేస్తుండడంతో వాటి నుంచి వెలువడే రసాయనాలు నీటిని కలుషితం చేస్తున్నాయి. ఇవి నీటిలో ఆక్సిజన్ లెవల్స్‌ను తగ్గిస్తాయి. దీంతో జలచరాలకు మనుగడ లేకుండాపోతోంది. అంతేగాక ఈ నీటిని వినియోగించడం వల్ల క్యాన్సర్ వంటి రోగాలు సోకుతాయి. అన్నివిధాలా హానికరం కాని మట్టి గణపతులను ప్రతిష్ఠించి గణేశ్ వేడుకలు నిర్వహించుకుంటే పర్యావరణానికి హితం కలుగుతుంది. వీలైనంత వరకు అన్ని గ్రామాల్లో ఒక్క మట్టిగణపతినే ప్రతిష్ఠించి పూజలు జరుపుకునే దిశగా యువత చైతన్యవంతులు కావాలని ఆకాంక్షిస్తున్నాం.

- కనుకుంట్ల విద్యాసాగర్, జనవిజ్ఞానవేదిక రాష్ట్రకమిటీ సభ్యుడు

విఘ్నాలు తొలగించే వినాయకుడిని భక్తితో పూజించాలి



విఘ్నాలు తొలగించే విఘ్నేశ్వరుడి నవరాత్రి ఉత్సవాలను భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోవాలని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రతీ ఏడాది మాదిరిగానే తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలను ప్రజలు శాంతియుత వాతావరణంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించాలన్నారు. ప్రతీ మండపంలో నిర్వహకులు భక్తి గీతాలను మాత్రమే పెట్టాలని సూచించారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, పాడి పంటలు పుష్కలంగా పండి ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలన్నారు. వినాయక చవితి పర్వదినం సందర్భంగా జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

- రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ఆధ్యాత్మికత వెల్లివిరిసేలా



గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా, సంప్రదాయ రీతిలో నిర్వహించాలి. ఆధ్యాత్మికత వెల్లివిరిసేలా కార్యక్రమాలు నిర్వహించాలి. మండపాల నిర్వహణలో పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలి. స్థానికసంస్థలు పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధచూపాలి. వర్షాలు కురుస్తున్నందున విద్యుదాఘాతం, తదితర ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠించి పూజించాలి.


-హనుమంతు కే.జెండగే, కలెక్టర్

శాంతియుతంగా నిర్వహించాలి



నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి. శాంతిభద్రతలకు భంగం కలిగించరాదు. నిర్వహణలో నిబంధనలను పాటించాలి. వదంతులను నమ్మకూడదు. అనుమానాస్పద వ్యక్తులు, కదలికలపై స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ప్రతీ మండపంలో రాత్రి పూట తప్పనిసరిగా నిర్వాహకులు నిద్రించాలి. ప్రతీ మండపం యూనిట్‌గా భద్రత ఏర్పాటు చేస్తున్నాం. నిమజ్జనంలో డీజేలను నిషేధించాం. సీసీ కెమెరాలతో పర్యవేక్షిస్తాం. ప్రతీ మండపం వివరాలను స్థానిక పోలీసులకు తెలపాలి.

- ఎం.రాజేష్‌చంద్ర, డీసీపీ



జిట్టా భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజలు

ఉద్యమస్ఫూర్తి..

చైతన్య దీప్తి

అస్వస్థతతో కన్నుమూసిన యువ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు జిట్టా

అశ్రునయనాల నడుమ బొమ్మాయిపల్లిలో అంత్యక్రియలు పూర్తి

శోకసంద్రంలో జిట్టా అభిమానులు

మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు.. యువతను సంఘటిత పరిచి సమకాలిన రాజకీయాల్లో క్రియాశీలకంగా మార్చి, ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలతో ఆదర్శంగా నిలిచిన నేత జిట్టా బాలకృష్ణారెడ్డి శుక్రవారం ఉదయం కన్నుమూశారు. అనారోగ్యానికి గురై 45 రోజులుగా చికిత్స పొందుతున్న ఆయన పరిస్థితి విషమించగా, తాను పుట్టిన భువనగిరి గడ్డకు తరలించాక తుది శ్వాస వదిలారు. తెలంగాణ గొప్పతనాన్ని చాటుతూ, ఫ్లోరైడ్ రక్కసిపై పోరాడుతూనే ఊరూరా.. వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి స్వచ్ఛమైన జలాలు అందించి జిట్టా ధాతృత్వం చాటుకున్నారు. మూసీ కాలుష్యంపై పాదయాత్ర, నిమ్స్ ఏర్పాటు, వైద్య సేవల కోసం రాజీలేని పోరాటాలు నిర్వహించి ప్రజానాయకుడిగా చెరిగిపోని ముద్ర వేసిన జిట్టా.. అలుపెరగని పోరాటానికి శాశ్వత సెలవిచ్చారు.

•7లో..

వర్షాలకు గూడ రాలుతోంది

» అన్నదాతకు కునుకులేకుండా చేస్తున్న పత్తి » వరికి గొట్టం రోగం » అదునుతప్పి కురుస్తున్న వానలకు దెబ్బతింటున్న పంటలు



మోత్కూరులో గూడ రాలిన పత్తి చేను

మోత్కూరు,సెప్టెంబరు 6: అదనుతప్పి కురుస్తున్న వర్షాలతో రైతన్న ఆగమవుతున్నాడు. జిల్లాలో ప్రధానంగా సాగయ్యేది వరి, పత్తి పంటలే. ఈఏడాది వర్షాకాలం ప్రారంభమై రెండున్నర మాసాలు గడిచాక,ఈ నెలలో కురిసిన వర్షాలు మినహా అంతకు ముందుకు భారీ వానలే లేవు. ఈ నెలలో కురిసిన భారీ వర్షాలు రాష్ట్రాన్ని అతలాకుతలం చేయగా, జిలాల్లో ప్రధానంగా మోత్కూరు, అడ్డగూడూరు, ఆత్మకూరు(ఎం), గుండాల తదితర మండల్లాలో నేటికీ చెరువులు, కుంటల్లోకి నీరు రాలేదు. బిక్కేరువాగులోనూ నీరు ప్రవహించలేదు. జిల్లాలో చెప్పుకోదగిన ప్రాజెక్టులు లేకపోవడంతో వర్షాధారంపైనే పంటలు సాగవుతున్నాయి. మెట్టపంటలతోపాటు చెరువులు, కుంటలు, బావులు, బోర్లపై ఆధారపడి రైతులు వరిసాగు చేస్తున్నారు. నేటికీ చెరువులు, కుంటలు నిండకపోవడంతో బావులు, బోర్లలో భూగర్భ జలాలు పెరగలేదు. దీంతో వరినాట్లు వేయలేకపోవడంతో నార్లు ముదురుతున్నాయి. వచ్చిపోయే చినుకులకు మడులు తడిపి, దున్ని నాటు వేసినా ఆ తర్వాత ఎండలకు ఎండిపోతున్నాయి. అదును ప్రకారం వర్షాలు లేక పత్తి, కంది చేలు కుంటుపడ్డాయి. ఈ వర్షాలు పత్తి చేలకు జీవం పోసినా, గూడ (మొగ్గ) రాలి నష్టాన్ని కలిగిస్తున్నాయి.

గూడ రాలుతున్న పత్తి

జిల్లాలో 1.04లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతోంది. జూలైలో భారీ వర్షాలు లేక, భూమి లోతుగా తడవక పత్తి చేలు వాడి అంతగా ఎదుగుదల లేదు. పత్తి మొలకెత్తిన మూడు మాసాల్లోనే పూర్తిగా ఎదగాలి. అప్పుడే సరైన దిగుబడి వస్తుంది. ఆగస్టులోనూ సరైన వర్షాలు లేక మరో సారి పత్తి చేలు వాడిపోయాయి. చేలు పూత, కాత దశలో ఉన్నాయి. ఆగస్టులో వర్షాలు లేక వాడిపోయిన చేలకు ఇటీవల కురిసిన వర్షాలు జీవం పోసినప్పటికీ గూడ (మొగ్గ) విపరీతంగా రాలిందని పత్తి రైతులు ఆవేదన చెందుతున్నారు. గూడ రాలడంతో 15 నుంచి 20శాతం దిగుబడి తగ్గుతుందని, పత్తి చేలకు తెగుళ్లు కూడా సోకుతున్నాయి, మందులు పిచికారీ చేసినా అదుపులోకి రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వరి పంటను దెబ్బతీస్తున్న గొట్టం రోగం



తెగుళ్లతో ఎర్రబారిన వరి

జిల్లాలో ఇప్పటికీ వరినాట్లు 70శాతం కూడా పూర్తికాలేదు. రైతులు ఇంకా వరినాట్లు వేస్తూనే ఉన్నారు. వచ్చిపోయే చినుకులకు రోజుకో మడి చొప్పున తడిపి, దున్ని నాటు వేయగా వర్షాలు లేక ఎండలు వచ్చినప్పుడు బావులు, బోర్ల నుంచి నీరు అందక వేసిన నాట్లు ఎండిపోతున్నాయి. ఎండిపోగా మిగిలిన వరి నాట్లకు కూడా గొట్టం రోగం సోకి వరి చేలు ఎర్రబారుతున్నాయని రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది వరి, మెట్ట పంటల సాగు ఏమాత్రం లాభసాటిగా లేదంటున్నారు. గూడ రాలిన పత్తి చేలకు ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ కింద ఉచితంగా ఎరువులు, క్రిమిసంహారక మందులు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

పంటలు దెబ్బతింటున్నాయి



నాకున్న భూమితో పాటు ఇతరుల భూమి కౌలుకు తీసుకుని 20 ఎకరాల్లో పత్తి సాగు చేశా. ఇటీవల కురిసిన వర్షాలకు పత్తి చేలల్లో 20శాతం గూడ రాలింది. గతంలో నాన్ బీటీ పత్తి కావడంతో నెలల తరబడి దిగుబడి వచ్చేది. ఇప్పుడు బీటీ పత్తి కావడంతో మొదట మైల పత్తి ఏరిన తర్వాత మరో రెండు, మూడు సార్లు ఏరితే పత్తి దిగుబడి ముగుస్తుంది. ఈ వర్షాలకు గూడ రాలడంతో దిగుబడి 20శాతం తగ్గినట్టే. ఏడు ఎకరాలు వరి నాటు వేయగా, రెండు ఎకరాల నాటు ఎండింది. వర్షాకాలమే అయినా నీళ్లు అందక బావి మళ్లీ పూడిక తవ్విస్తున్నా. గూడ రాల్చిన పత్తి చేలకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద ఉచితంగా ఎరువులు, క్రిమి సంహారక మందులు అందించి ప్రభుత్వం ఆదుకోవాలి.

- మర్రి మధు, రైతు మోత్కూరు

ఆలేరు ఆస్పత్రిని 50 పడకలకు మార్చుతాం

» పేదలకు మెరుగైన వైద్య సేవలే ప్రభుత్వ లక్ష్యం » ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



ఆలేరు ఆస్పత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల, కలెక్టర్

ఆలేరు రూరల్, సెప్టెంబరు 6: ఆలేరు ఆస్పత్రిని 30 పడకల నుంచి 50కి పెంచేందుకు కృషి చేస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. శుక్రవారం ఆలేరులోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ హనుమంతు కే.జెండగేతో కలిసి తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నదే సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యమన్నారు. ఆలేరు ఆస్పత్రిలో ప్రైవేట్ ఆస్పత్రులకు దీటుగా వైద్య సేవలు అందిస్తున్నారని వైద్యులను, సిబ్బంది అభినందించారు. కొంతమంది రాజకీయ నాయకులు కావాలనే దురుద్దేశంతో ఆస్పత్రిపై రాజకీయం చేస్తున్నారని, ఎన్నికలప్పుడే రాజకీయాలు చేయాలన్నారు. ఆలేరును అన్ని విధాలా అగ్రగామిగా నిలిపేందుకు అన్ని పార్టీలు సహకరించాలన్నారు. ప్రస్తుతం 10 పడకలతో ఉన్న డయాలసిస్ కేంద్రాన్ని 20 పడకలుగా మార్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డితో పాటు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదరం రాజనర్సింహను కలిసి మాట్లాడతానన్నారు. ఆరు నెలలుగా వేతనాలు రావడం లేదని కాంట్రాక్ట్ ఉద్యోగులు ఈ సందర్భంగా ఆయన దృష్టికి తేగా డీసీహెచ్‌ఎస్ నాయక్‌తో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కరించాలన్నారు. అనంతరం బైరాంనగర్ గ్రామస్థులు తమ గ్రామాన్ని పంచాయతీగా ప్రకటించడంపై ప్రభుత్వ విప్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ స్వప్న రాథోడ్, మునిసిపల్ కమిషనర్ లక్ష్మి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, మాజీ ఎంపీపీలు గంధమల్ల అశోక్, చీర శ్రీశైలం, నాయకులు వెంకటేశ్వర్‌రాజు, ఎజాజ్, శ్రీనివాస్‌రెడ్డి, సాగర్‌రెడ్డి, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనత లేకుండా అవగాహన కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శిశు సంక్షేమశాఖ జిల్లా అధికారి కృష్ణవేణి

జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ అధికారి కృష్ణవేణి

రామన్నపేట, సెప్టెంబరు 6: గర్భిణులు, బాలింతలు, పిల్లల్లో రక్తహీనత లేకుండా అవగహన కల్పించాలని జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ అధికారి కృష్ణవేణి అన్నారు. పోషణ మాసం సందర్భంగా శుక్రవారం రామన్నపేట సీడీపీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు పౌష్ఠకాహారం అందించాలన్నారు. అంగన్‌వాడీల నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. ఈ సందర్భంగా పోషకాహారాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లాల్‌బహదూర్, ఎంపీడీవో భూక్య యాకుబ్ నాయక్, సీడీపీవో వెంకటరమణ, ఏసీడీపీవో సమీరా, ఏపీవో వెంకన్న, గోపాల్, సూపర్‌వైజర్లు హేమలత, బాలమణి, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు చట్టాలను వినియోగించుకోవాలి

భువనగిరి రూరల్: మహిళల కోసం రూపొందించిన చట్టాలను వినియోగించుకోవాలని జిల్లా మహిళ సాధికారిత కేంద్రం జండర్ స్పెషలిస్ట్ నిఖిత అన్నారు. శుక్రవారం భువనగిరి మండలంలోని ఆదర్శ నగర్,చావుస్‌గల్లీ,మీనానగర్, అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గృహహింస చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో కోడి గుడ్ల నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు జీ.విజయగౌరి, లలిత పాల్గొన్నారు.

దేశ రక్షణకు యువత ముందుకు రావాలి

కొండమల్లేపల్లి, సెప్టెంబరు 6: దేశ రక్షణకు యువత ముందుకు రావాలని ఆర్మీ మేజర్లు రావత్, అబిజిత్ అన్నారు. దేశంలో ఆర్మీ సేవలు ప్రారంభమై 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా 21మంది ఆర్మీ జవాన్లతో గత జూలై 30న జమ్మూకాశ్మీర్‌లోని సియాచిన్ బేస్ క్యాంప్ నుంచి అండమాన్ నికోబార్ దీవులలోని ఇందిరాపాయింట్ వరకు నిర్వహిస్తున్న సైకిల్ యాత్ర శుక్రవారం కొండమల్లేపల్లికి చేరుకుంది. ఈ సందర్భంగా ఎంజేపీ బాలికల పాఠశాల, కళాశాలను బృందం సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం దేశ రక్షణే ధ్యేయంగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దూదిపాల రేఖ, శ్రీధర్‌రెడ్డి, సీఐ ధనుంజయ్య, ఎస్ఐ రామ్మూర్తి, వేమన్ రెడ్డి, మల్లీశ్వరి పాల్గొన్నారు.


ఆర్మీ జవాన్లతో విద్యార్థినులు

ఆండాళ్ అమ్మవారికి వైభవంగా ఊంజల్ సేవ

భువనగిరి అర్బన్, సెప్టెంబరు 6: యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామివారి సన్నిధిలో శుక్రవారం స్వామివారికి స్వర్ణపుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆగమశాస్త్ర రీతిలో వేడుకలు నిర్వహించిన పూజారులు వేకువజామున సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపి పంచామృతాలు, వేదమంత్ర పఠనాలతో అభిషేకం, తులసీదళాలు, కుంకుమతో అర్చించారు. ప్రాకార మండపంలో హోమం, నిత్యకల్యాణం సంప్రదాయరీతిలో కొనసాగాయి. సాయంత్రం ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాల్ అమ్మవారికి పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి సేవలో తీర్చిదిద్దారు. అమ్మవారి సేవను ఆలయ తిరువీధుల్లో ఊరేగించిన అర్చకులు ప్రాకార మండపంలోని అద్దాల మండపం ఊయలలో అధిష్ఠింపజేశారు.


ఊంజల్ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

అర్చకుల వేదమంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసులతో మంగళవాయిద్యాలు, మహిళా భక్తుల మంగళ నీరాజనాల నడుమ ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సాంప్రదాయ రీతిలో కొనసాగాయి. శివాలయంలో పర్వతవర్ధిని రామలింగేశ్వర స్వామి వారికి నిత్య పూజలు, యాగశాలలో చండీహోమం శైవాగవ పద్ధతిలో చేపట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల నుంచి రూ.9,67,374 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు. ఈ నెల 12న హుండీ లెక్కింపు కొండకింద వ్రత మండపంలో నిర్వహిస్తున్నట్లు ఈవో తెలిపారు. నిత్యం రద్దీతో కిటకిటలాడే యాదగిరిగుట్ట దివ్యక్షేత్రంలో భక్తుల రాక గణనీయంగా తగ్గుముఖం పట్టడంతో ఆలయ మాడవీధులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

డీజేలు పెడితే చర్యలు : సీఐ

హుజూర్‌నగర్ రూరల్, సెప్టెంబరు 6: వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా డీజేలు పెడితే సహించేది లేదని సీఐ చరమందరాజు హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని వివిధ ప్రాంతాలకు చెందిన డీజే యజమానులు 17మందిని తహసీల్దార్ నాగేందర్ ఎదుట బైండోవర్ చేశారు. చట్టాన్ని ఉల్లంఘిస్తే సహించబోమన్నారు. వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా అనుమతులు తీసుకొని మండపాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించుకోవాలన్నారు. భక్తిశ్రద్ధలతో వినాయకుడి పూజలు చేయాలన్నారు.

అటవీ అధికారులపై దాడి

దామరచర్ల, సెప్టెంబరు 6: దామరచర్ల మండలంలోని దిలావర్‌పూర్, కేజేఆర్ కాలనీలో ఆక్రమణకు గురైన అటవీ భూములను ఫారెస్ట్ అధికారులు స్వాధీనం చేసుకొని మొక్కలు నాటుతుండగా బాలాజీనగర్‌తండాకు చెందిన వాంకుడోతు రమేష్ అనే వ్యక్తి ఫారెస్ట్ అధికారులపై దాడికి పాల్పడి గాయపరిచాడు. ఈ దాడిలో బీట్ ఆఫీసర్ ముఖేష్‌కు గాయాలయ్యాయి. అదేవిధంగా రేంజ్ ఆఫీసర్ శేఖర్‌రెడ్డి, సెక్షన్ ఆఫీసర్ మల్లారెడ్డి, మరో బీట్ ఆఫీసర్ స్వామి, రవీందర్ రెడ్డిలపై దాడికి పాల్పడగా పోలీసులకు ఫిర్యాదుచేశారు. అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



అధికారులపై దాడి చేస్తున్న యువకుడు

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

మాడ్గులపల్లి, సెప్టెంబరు 6: మాడ్గులపల్లి మండలంలోని ఇందుగుల గ్రామానికి చెందిన కోదూరు వెంకన్న కుమార్తె అక్షర జాతీయ స్థాయి సబ్ జూనియర్ ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికైంది. జూలైలో మహబూబ్‌నగర్ జిల్లా కల్వకుర్తిలో నిర్వహించిన సబ్ జూనియర్ డిస్ట్రిక్ట్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో అక్షర ప్రతిభ కనబరిచింది. దీంతో మధ్యప్రదేశ్‌లోని నిమోచ్ అనే పట్టణంలో ఈ నెల 8నుంచి జరిగే జాతీయస్థాయి అండర్-14 ఫుట్‌బాల్ పోటీలకు తెలంగాణ రాష్ట్రం తరఫున ఆడేందుకు ఎంపికైంది. కాగా అక్షర నల్లగొండలోని బీసీ వెల్ఫేర్ పాఠశాలలో 7వ తరగతి చదువుతుంది.

చింత, బియ్యపు గింజలపై వినాయక ప్రతిమ

సూర్యాపేట జిల్లా కోదాడ సూక్ష్మ కళాకారుడి ప్రతిభ


బియ్యం, చింత గింజపై చెక్కిన వినాయక రూపం, కళాకారుడు సైదులు

కోదాడ, సెప్టెంబరు 6: వినాయక చవితిని పురస్కరించుకుని సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన సూక్ష్మ కళాకారుడు తమలపాకుల సైదులు చింత గింజ, బియ్యపు గింజలపై, సుద్దముక్కపై వినాయక రూపాలను చెక్కి సూక్ష్మ కళను ప్రదర్శించారు. 10మి.మీ పొడవు, 10మి.మీ వెడల్పు ఉన్న చింతగింజపై, 19 మి.మీ ఎత్తు, 8మి.మీ వెడల్పు ఉన్న సుద్దముక్కపై, 9మి.మీ ఎత్తు, 1.1 వెడల్పు ఉన్న బియ్యపు గింజపై వినాయక రూపాన్ని చెక్కి చూపరులను అబ్బురపర్చారు. ఒక్కో ప్రతిమ చెక్కేందుకు అరగంట సమయం పట్టిందని సైదులు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

బీబీనగర్, సెప్టెంబరు 6: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండల కేంద్రంలో శుక్రవారం ఈ ఘటన జరిగింది. ఎస్ఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణానికి చెందిన ఉప్పలంచి రమేశ్ (50)గేదెల వ్యాపారం, కిరాణం షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాగా వ్యాపారంలో నష్టాలు రావడంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. దీంతో గత కొన్నిరోజుల నుంచి మానసిక ఆందోళనకు గురవుతూ జీవితంపై విరక్తి చెంది ఉదయం తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రమేశ్ భార్య పుష్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అడ్డగూడూరు: పురుగులమందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం మండలంలోని వెల్దేవి గ్రామంలో ఈ ఘటన జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన గంట వినోద్ కుమార్ (23) హైదరాబాదులో క్యాబ్‌డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం ఇంట్లో చిన్నపాటి గొడవ జరగ్గా, మనస్తాపానికి గురై పురుగుల మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు నల్లగొండలోని ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు.

పుస్తెల తాడు అపహరించిన వ్యక్తుల అరెస్టు

మోత్కూరు, సెప్టెంబరు 6: మోత్కూరు మండలం ముశిపట్ల శివారులో గత నెల 29న మహిళ మెడలోంచి పుస్తెల తాడు లాక్కెళ్లిన ఇద్దరు దొంగలను శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం రాత్రి మోత్కూరు పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రామన్నపేట సీఐ వెంకటేశ్వర్లు వివరాలు వెల్లడించారు. అడ్డగూడూరు మండల కేంద్రానికి చెందిన ఆసర్ల మల్లయ్య, సోమక్క దంపతులు గత నెల 29న మోత్కూరు మండలం ముశిపట్ల గ్రామంలోని తమ కుమార్తె ఇంటికి ద్విచక్రవాహనంపై వెళుతున్నారు. సిద్దిపేటకు చెందిన పున్న రవి, యాదగిరిగుట్ట మండలం మల్లాపూర్‌కు చెందిన చింతల చందు కారులో అనాజిపురం- ముశిపట్ల గ్రామాల మధ్య మల్లయ్య ద్విచక్ర వాహనాన్ని దాటి ముందుకు వెళ్లి కారు తిప్పుకుని వెనక్కు వచ్చి సోమక్క మెడలో ఉన్న 3 తులాల బంగారు పుస్తెల తాడు లాక్కొని కారులో పరారయ్యారు. వారి ఫిర్యాదు మేరకు ఆరోజే మోత్కూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. శుక్రవారం అనాజిపురం వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా రవి, చందులు.. కారు వస్తున్న తీరు అనుమానాస్పదంగా ఉండటంతో పోలీసులు ఆ కారు ఆపి వారిద్దరిని విచారించగా పుస్తెల తాడు దొంగిలించింది తామేనని ఒప్పుకున్నారు. చందుకు కారు ఉండగా దాన్ని అద్దెకు నడుపుతుంటాడు. అతనికి ఈ ప్రాంతం గురించి తెలుసు. ప్రేమ జంటలను బెదిరించి వారి నుంచి డబ్బులు వసూలు చేస్తుంటాడు. అతనిపై చౌటుప్పల్ పోలీస్‌స్టేషన్‌లో రెండు, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్‌లో రెండు కేసులు నమోదయ్యాయి. రవి గతంలో ఓ మహిళ పుస్తెల తాడు దొంగిలించి జైలు కెళ్లాడు. వారిద్దరికి జైల్లోనే పరిచయమైంది. వారిద్దరు ఎక్కడ సీసీ కెమెరాలు ఉన్నాయి. ఎక్కడ దొంగతనాలకు అనువుగా ఉంటుందన్నది ముందుగా రెక్కీ నిర్వహించి దొంగతనాలకు పాల్పడుతుంటారు. శుక్రవారం కూడా మరో పుస్తెల తాడు దొంగిలించి చెరొకటి తీసుకోవాలన్న తలంపుతో కారులో వెళుతూ పోలీసులకు పట్టుబడ్డారు. సోమక్క మెడలోంచి దొంగిలించిన పుస్తెల తాడు రికవరీ చేశామని, వారిని రిమాండ్‌కు పంపిస్తున్నామన్నారు. ఎస్ఐ నాగరాజు ఆయన వెంట ఉన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న రామన్నపేట సీఐ వెంకటేశ్వర్లు

'సాగర్'కు 2,34,707 క్యూసెక్కుల వరద

● 20 గేట్ల నుంచి నీటి విడుదల ● గరిష్ట నీటిమట్టం దిశగా 'మూసీ' ● 'పులిచింతల' నాలుగు గేట్లు ఎత్తివేత

నాగార్జునసాగర్, కేతేపల్లి, మేళ్లచెర్వు, సెప్టెంబరు 6: నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద రాక పెరిగింది. శుక్రవారం మధ్యాహ్నం 2 గేట్లు ఎత్తగా, వరద రాకకు అనుగుణంగా గేట్ల సంఖ్యను పెంచుతూ సాయంత్రానికి 20గేట్ల నుంచి నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్‌కు ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు నుంచి మొత్తం 2,34,707 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.5050) కాగా, శుక్రవారం సాయంత్రానికి 589.90 అడుగులుగా(311.7412టీఎంసీలు) నమోదైంది. సాగర్ కుడికాల్వ ద్వారా 8490 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 3035 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,339 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, వరదకాల్వ ద్వారా 600 క్యూసెక్కులు, 20 క్రస్ట్‌గేట్ల నుంచి 1,61,800 క్యూసెక్కులు మొత్తంగా 2,04,064 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

నెమ్మదించిన మూసీ

వారంరోజులుగా వరద నీటితో పొంగిపొర్లిన మూసీ నది కొంత నెమ్మదించింది. 645 అడుగుల (4.46 టీఎంసీలు) గరిష్ట నీటిమట్టం కలిగిన మూసీ జలాశయం శుక్రవారంసాయంత్రానికి 642.65 అడుగులకు (3.86 టీఎంసీలు) చేరింది. ఎగువనుంచి 5670 క్యూసెక్కులుగా ఇన్‌ఫ్లో నమోదైంది.

'పులిచింతల' నాలుగు గేట్లు ఎత్తివేత

ఉభయ తెలుగు రాష్ట్రాల సరిహద్దులోని పులిచింతల ప్రాజెక్టు నాలుగు గేట్లు మూడు మీటర్లు ఎత్తి 95,568 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. పూర్తిస్థాయి నీటిమట్టం 175 అడుగులు (45.77 టీఎంసీలు) కాగా శుక్రవారం సాయంత్రానికి 173 అడుగులుగా (42.77 టీఎంసీలు) నమోదైంది. ప్రాజెక్టుకు ఎగువనుంచి 70,178 క్యూసెక్కుల వరద వస్తుండగా, 16వేల క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ నాలుగు యూనిట్ల ద్వారా 104 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేస్తున్నారు.

ఉద్యమ స్ఫూర్తి.. చైతన్య దీప్తి

● అస్వస్థతతో కన్నుమూసిన యువ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు జిట్టా బాలకృష్ణారెడ్డి ● అశ్రునయనాల నడుమ బొమ్మాయిపల్లిలో అంత్యక్రియలు ● శోకసంద్రంలో జిట్టా అభిమానులు

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం తన జీవితాన్ని ధారపోసిన జిట్టా ఇకలేరు. ఎప్పుడు ఏ సమస్య వచ్చినా.. అన్నా.. అంటే నేనున్నా అనే వ్యక్తి ఇక లేరన్న విషయం తెలిసి ఆయన అభిమానుల గుండెలు పగిలాయి. అన్న ఇక రారన్న విషయం తెలిసి బోరున విలపించాయి.

● భువనగిరి రూరల్

● ఇక సెలవ్



జిట్టా బాలకృష్ణారెడ్డి(ఫైల్)

● చివరి చూపు



మలిదశ తెలంగాణ ఉద్యమ కెరటం.. జిట్టా బాలకృష్ణారెడ్డి శుక్రవారం ఉదయం కన్నుమూశారు. అనారోగ్యానికి గురై సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో 45 రోజులుగా చికిత్స పొందుతున్న ఆయన భువనగిరి గడ్డపై తుది శ్వాస విడిచారు. స్వామి వివేకానందుడి స్ఫూర్తితో యువతను సంఘటితపరిచి సమకాలిన రాజకీయాల్లో యువకులు క్రియాశీలకంగా మారాలనే లక్ష్యంతో ఎన్నో సామాజిక సేవలు చేసి ఆదర్శ నేతగా నిలిచారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం అంటే భౌగోళికంగానే కాదు సాంస్కృతికంగా ఔన్నత్యాన్ని చాటి చెబుతూ భువనగిరి, హైదరాబాద్‌లోని నిజాం కళాశాలతోపాటు జాతీయస్థాయిలో న్యూఢిల్లీలోని ఇండియా గేట్ వద్ద 'తెలంగాణ జాతర' నిర్వహించి ప్రపంచానికి చాటి చెప్పారు. భువనగిరి ఖిల్లాకు దేదీప్యమాన లైటింగ్, లేజర్ షో ఏర్పాటు చేసి తెలంగాణ గొప్పతనాన్ని నిరూపించారు. నల్లగొండ ప్రజలను పట్టి పీడించిన ఫ్లోరైడ్ రక్కసిపై పోరాటాలే కాదు.. తక్షణ ఉపశమనంగా ఊరూరా.. వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి ఔన్నత్యాన్ని చాటుకున్నారు. మూసీ కాలుష్యంపై పాదయాత్రలతో ఉద్యమాలు చేశారు. నిమ్స్ ఏర్పాటుకు, ఆ తర్వాత ఎయిమ్స్ స్థాపన వరకూ రాజీలేని పోరాటాలు నిర్వహించిన వ్యక్తి బాలకృష్ణారెడ్డి. చట్టసభల్లో ప్రవేశానికి ఒక అడుగు దూరంలో నిలిచిపోయినా రాష్ట్ర ప్రజలు, ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజల గుండెల్లో మాత్రం ప్రజానాయకుడిగా చెరిగిపోని ముద్ర వేసుకున్నారు.

52 ఏళ్ల వయసులోనే...

స్వార్థమెరుగని తెలంగాణ ప్రజానాయకుడు జిట్టా బాలకృష్ణారెడ్డి కేవలం 52 ఏళ్ల వయసులోనే కన్నుమూసి ఈ ప్రాంత ప్రజలను దుఃఖ సాగరంలో ముంచారు. భువనగిరి మండలం బొమ్మాయిపల్లిలో జిట్టాబాల్ రెడ్డి, రాధమ్మ దంపతులకు 1972లో ఆయన మొదటి సంతానంగా జన్మించాడు. ఆయన తండ్రి బాల్‌రెడ్డి రిటైర్డ్ ఉపాధ్యాయులు. 1987లో బీబీనగర్ జడ్పీ హైస్కూల్‌లో పదోతరగతి, 1989లో భువనగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసిన ఆయన 1993లో హైదరాబాద్ ఎల్బీనగర్‌లోని డీవీఎం డిగ్రీ, పీజీ కళాశాల నుంచి బీకాం గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు.

ప్రజాజీవిత ప్రస్థానం..

స్వామి వివేకానందుడి స్ఫూర్తితో 1992 సంవత్సరంలో వివేకానంద యువజన సంఘం స్థాపించారు. 1997లో రంగారెడ్డి జిల్లా యువజన సంఘాల సమితిని ఏర్పాటు చేసిన ఆయన 2000లో ఉమ్మడి రాష్ట్రవ్యాప్తంగా విస్తరింప చేసి వ్యవస్థాపక అధ్యక్షుడిగా కొనసాగారు. రాష్ట్రంలో 10వేల యువజన సంఘాలను ఒకే వేదికపై తీసుకువచ్చారు. 2002లో నార్త్ అమెరికా యువజన సంఘాల సమితిని నెలకొల్పి గౌరవ అధ్యక్షుడిగా వ్యవహరించారు. ఆధ్యాత్మికంగా హైదరాబాద్‌లోని కొత్తపేట ఉడా కాంప్లెక్స్ రామాలయం ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. హైదరాబాద్ జూనియర్ ఛాంబర్స్ వారి సామాజిక సేవా పురస్కారం, భారత ప్రభుత్వంచే జాతీయ స్థాయి ఉత్తమ సేవ పురస్కారం అందుకున్నారు.

ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం

ప్రజా సమస్యలపై పాలకులు పట్టింపులేనితనాన్ని ప్రశ్నిస్తూ ఆయన తుది శ్వాస వరకు అలుపెరగని ప్రజాపోరాటాలు నిర్వహించారు. నల్లగొండ జిల్లా ప్రజలను పట్టి పీడించే ఫ్లోరోసిస్ రక్కసిపై రాజీలేని పోరాటాలు నిర్వహించారు. ఊరూరా కాగడాల ప్రదర్శనలు జరిపి, ప్రభుత్వాల నుంచి స్పందన లేకపోయినా కుంగిపోకుండా రూ.3.50కోట్లతో దాదాపు 106 గ్రామాల్లో నీటి శుద్ధికి వాటర్ ప్లాంట్లను స్వయంగా ఏర్పాటుచేశారు. అదేవిధంగా మూసీ ప్రక్షాళన చేయాలనే డిమాండ్‌తో 2005లోనే పాదయాత్ర చేపట్టారు. మూసీ పరివాహక ప్రాంతంలో సమస్య తీవ్రతను అద్దం పట్టే విధంగా వలిగొండ నుంచి హైదరాబాద్ వరకు 200 కిలో మీటర్ల పాదయాత్ర చేపట్టారు. ఈ ఆందోళన ఫలితంగా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం రూ.350కోట్లతో మూసీ శుద్ధి ప్లాంట్ ఏర్పాటు జిట్టా పోరాట ఫలితమే. అదే విధంగా బీబీనగర్ వద్ద నిమ్స్ ఆసుపత్రి ఏర్పాటులో జాప్యాన్ని నిలదీస్తూ అసెంబ్లీ ముట్టడి, నిరాహార దీక్షలు చేపట్టడంతో అప్పటి ప్రభుత్వం వైద్య సేవలు ప్రారంభించింది. నిమ్స్‌ను పరిరక్షించడమే కాకుండా ఈప్రాంగణాన్ని ఎయిమ్స్‌కు అప్పగించడానికి కూడా కృషి చేశారు. సాగునీటి వసతి లేని భువనగిరి ప్రాంతానికి మూసీ నీటిని మళ్లించాలని కోరుతూ పాదయాత్రలు, రైతులను సంఘటితం చేసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టారు. వాటి ఫలితంగానే బునాదిగాని, పిలాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వల ద్వారా వేలాది ఎకరాలకు మూసీ నీరు అందుతుంది. పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత చదువులు అందించాలనే లక్ష్యంతో, ఆయన మేనమామ.. ఎన్ఆర్ఐ డాక్టర్ చిలుముల రామచంద్రారెడ్డి ఫౌండేషన్ సాయంతో 2003లో రూ.కోటి 20లక్షలతో సీఎస్ఎన్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మించారు. విద్యార్థుల కోసం ఐదేళ్లపాటు ఉచితంగా తన సొంత డబ్బులతో ఉచిత మధ్యాహ్న భోజనం అందించారు. వలిగొండ మండలం దుప్పెల్లిలో చిలుముల ఫౌండేషన్ సహకారంతో 2005లో రూ.35లక్షలతో జడ్పీ హైస్కూల్ భవనాన్ని, స్వగ్రామమైన బొమ్మాయిపల్లిలో 2006లో ప్రాథమిక పాఠశాలలో తరగతి గదుల ఏర్పాటు, యూత్ భవన నిర్మాణం చేయించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట యువతకు ఆదర్శమైన స్వామి వివేకానంద కాంస్య విగ్రహం ఏర్పాటుతో పాటు యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో తెలంగాణ అమరవీరుల స్థూపం నిర్మించారు. 2007లో తెలంగాణ సంబురాలలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని పరిచయంచేసి సొంత నిధులతో జిట్టా ప్రస్తుత బీఆర్ఎస్ తెలంగాణ భవన్‌లో మొట్టమొదటి తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

● కన్నీటి పర్యంతం



ఉద్యమానికి తలమానికం .. తెలంగాణ జాతరలు..

తెలంగాణ ప్రజల సాంస్కృతిక వారసత్వాన్ని గల్లి నుంచి ఢిల్లీ వరకు చాటి చెప్పడానికి ఆర్థికంగా ఎంతో నష్టపోయినా తెలంగాణ జాతర పేరిట ఇక్కడి ప్రజల జీవన విధానం, కళలు, పండుగలు, శిల్పకళ, వైభవ సంబురాలు నిర్వహించారు. మొదటిసారిగా 2007లో భువనగిరి ఖిల్లాకు లేజర్ లైటింగ్‌తోపాటు తెలంగాణ వంటకాలు, పండుగలు వంటి వాటిని ప్రదర్శిస్తూ తెలంగాణ జాతర ఏర్పాటు చేశారు. ఆ తర్వాత 2010లో హైదరాబాద్‌లోని నిజాం కళాశాల మైదానంలో, ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్ గ్రౌండ్‌లో నిర్వహించారు. ఈ జాతరలో తెలంగాణలో వృత్తులు, గ్రామీణ కళలు.. ఇక్కడి గొప్పతనానికి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చారు.

అశ్రునయనాల నడుమ అంతిమ వీడ్కోలు

జిట్టా బాలకృష్ణారెడ్డి భౌతిక కాయాన్ని హైదరాబాద్‌నుంచి నేరుగా జిల్లా కేంద్రంలోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద తీసుకువచ్చి నివాళులర్పించారు. అనంతరం ఆయన ఫామ్‌హౌస్ వద్ద భౌతిక కాయాన్ని సందర్శకుల చివరి చూపుకోసం నాలుగు గంటలపాటు ఉంచారు. స్వగ్రామం బొమ్మాయిపల్లిలో ప్రముఖుల సంతాపం, అశ్రునయనాలు, అభిమానులు జిట్టా జోహార్లు, అమర్‌హై అంటూ నినాదాలతో అంతిమయాత్ర కొనసాగింది. మునుగోడు, భువనగిరి ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, కుంభం అనిల్‌కుమార్ రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి శుక్రవారం సాయంత్రం అంతిమ యాత్రలో పాల్గొని జిట్టా పాడే మోశారు. ఆయనకు కడసారి వీడ్కోలు పలికేందుకు రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ, ఎమ్మెల్సీలు కోదండరాం, తీన్మార్ మల్లన్న, ఎంపీలు చామల కిరణ్‌కుమార్ రెడ్డి, గుత్తా అమిత్‌రెడ్డి, మాజీ మంత్రులు హరీశ్‌రావు, గుంటకండ్ల జగదీశ్ రెడ్డి, మాజీ స్పీకర్ మధుసూదనచారి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, శాసన సభ్యులు మందుల సామేల్, రాజగోపాల్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, డీసీసీబీ ఛైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, చెరుకు సుధాకర్, పల్లె రవికుమార్, ఉమాదేవి, మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్య గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్ రెడ్డి, గొంగిడి సునీత, డాక్టర్ కుడుదుల నగేశ్, కంచర్ల భూపాల్ రెడ్డి, కసిరెడ్డి నారాయణ రెడ్డి, పల్లా వెంకట్‌రెడ్డి, ఉజ్జిని నారాయణరావు, గోద శ్రీరాములు, గూడూరు నారాయణ రెడ్డి, చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, రాణి రుద్రమ దేవి నివాళి అర్పించారు. జిట్టా కుమారుడు వివేకానందరెడ్డి.. తండ్రి చితికి నిప్పంటించారు.



నివాళులర్పిస్తున్న రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కోదండరాం, తీన్మార్ మల్లన్న, గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, మందకృష్ణ మాదిగ, గుత్తా అమిత్‌రెడ్డి, హరీశ్‌రావు, మందుల సామేల్, బీర్ల అయిలయ్య, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, చెరుకు సుధాకర్

కట్టంగూరులో భారీ అగ్ని ప్రమాదం

● సుమారు రూ.2కోట్లకు పైగా ఆస్తి నష్టం ● మూడు డీసీఎంలు దగ్ధం



కట్టంగూరులో దగ్ధమవుతున్న పొట్టు కంపెనీ

కట్టంగూరు, సెప్టెంబరు 6: ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ జరిగి ఓ పొట్టు కంపెనీలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఘటన కట్టంగూరు శివారులో శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. కట్టంగూరుకు చెందిన అన్నదములు.. చెరుకు రమేష్, నాగరాజు కలిసి కట్టంగూరు గ్రామ శివారులోని బొల్లేపల్లికి వెళ్లే దారిలో పొట్టు కంపెనీ ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. రోజువారీ కార్యక్రమంలో భాగంగా మూడు డీసీఎంలలో సన్న పొట్టు లోడ్ చేసి కంపెనీలో ఉంచి కంపెనీకి తాళాలు వేసి వెళ్లారు. పక్కనే ఉన్న మరో కంపెనీకి చెందిన వ్యక్తి పొట్టు కంపెనీలో నుంచి పొగలు వస్తుండటం చూసి కంపెనీ యజమానులకు సమాచారం ఇచ్చారు. తెల్లవారుజాము నుంచి పొగలు వ్యాపించి ఈ మిల్లులో పెద్దఎత్తున సన్నపొట్టు సంచులు నిల్వ ఉండటంతో పెద్దఎత్తున మంటలు వ్యాపించాయి. దీంతో నకిరేకల్, నల్లగొండ నుంచి రెండు ఫైర్ ఇంజన్లు వచ్చి మంటలు ఆర్పడం మొదలుపెట్టాయి. మంటలు ఎక్కువ కావడంతో కట్టంగూరుకు చెందిన మరో మూడు జేసీబీల సహాయంతో పొట్టు బస్తాలను బయటకు లాగేందుకు ప్రయత్నించారు. మంటలు విపరీతంగా రావడంతోపాటు దాదాపు కంపెనీలో నాలుగు టన్నుల నుంచి ఐదు టన్నుల పొట్టు బస్తాల్లో పొట్టు నిల్వ ఉండటంతో మంటలు ఎక్కువయ్యాయి. ఈ ప్రమాదంలో మిల్లులో ఉన్న మూడు డీసీఎంలు పూర్తిగా దగ్ధమయ్యాయి. అదేవిధంగా ఐదు టన్నుల పొట్టు కాలి బూడిదైంది. ఇవేకాకుండా కంపెనీలు ఉన్న ఇతర సామగ్రి పూర్తిగా కాలిపోయింది. సన్నపొట్టు కావడంతో మంటలు చల్లారడం లేదు. దీంతో శుక్రవారం తెల్లవారుజాము నుంచి అగ్నిమాపక కేంద్రాల వద్ద సాయంత్రం వరకు మంటలను ఆర్పుతూనే ఉన్నారు.

రూ.2కోట్లకు పైగా ఆస్తి నష్టం

అగ్ని ప్రమాదంలో రూ.2కోట్లకు పైగా ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేశారు. ప్రమాదంలో రూ.50లక్షల విలువైన షెడ్, రూ.30లక్షల విలువైన మిషనరీ, రూ.60లక్షల నుంచి రూ.70లక్షల విలువైన మూడు డీసీఎంలు, సుమారు రూ.40లక్షల నుంచి రూ.50లక్షల సన్నపొట్టు పూర్తిగా దగ్ధమైంది. ఈ కంపెనీలో రంపపు పొట్టును రీసైక్లింగ్ చేసి మెత్తటి పొట్టుగా తయారు చేసిన పొట్టుతో ఊదుబత్తిలు, జెట్ కాయిల్స్ తయారు చేయడానికి ఉపయోగిస్తారు.

నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం పరామర్శ

కట్టంగూరులో అగ్ని ప్రమాదం విషయం తెలుసుకున్న నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం హుటాహుటిన సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. కంపెనీ మొత్తం తిరిగి ఆరా తీశారు. బాధితులతో మాట్లాడి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తనవంతు సహాయంగా నష్టపరిహారం అందించేందుకు కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ రాష్ట్రనేత దైద రవీందర్, తహసీల్దార్ గుగులోతు ప్రసాద్, ఎస్ఐ ఎన్.శ్రీనులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. తహసీల్దార్ ప్రసాద్ ప్రమాదం జరిగిన తీరును తెలుసుకొని పంచనామా నిర్వహించారు. ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో కంపెనీ దగ్ధమైందని సుమారు రూ.2కోట్లకు పైగా ఆస్తి నష్టం జరిగిందని ప్రభుత్వం సహాయం అందించి ఆదుకోవాలని బాధితులు చెరుకు రమేష్, చెరుకు నాగరాజులు ప్రభుత్వాన్ని కోరారు.

బెల్ట్ షాపులపై ఎక్సైజ్ అధికారుల దాడులు

మోత్కూరు, సెప్టెంబరు 6: మోత్కూరు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అడ్డగూడూరు మండలం మానాయకుంట గ్రామంలో శుక్రవారం ఓ బెల్ట్ షాపుపై ఎక్సైజ్ పోలీసులు దాడి చేసి మద్యం బాటిళ్లు సీజ్ చేశారు. మద్యం అక్రమంగా నిల్వ చేశారన్న సమాచారం మేరకు తాము దాడి చేసి ఓ బెల్ట్ షాపు నుంచి 14 ఐబీ, 13 ఓసీ విస్కీ బాటిళ్లు స్వాధీన పర్చుకున్నామని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఇన్‌స్పెక్టర్ కె.రవిచంద్రారెడ్డి తెలిపారు. ఒకరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. ఈనెల 4న మోత్కూరు, వలిగొండ పట్టణాల్లో దాడులు జరిపి బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు. అక్రమంగా మద్యం నిల్వ చేసినా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోదాల్లో సిబ్బంది వినోద్‌సింగ్, రహమాన్, నర్సింహులు, వెంకటేష్, కృష్ణ పాల్గొన్నారన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

కేతేపల్లి, సెప్టెంబర్ 6: కేతేపల్లిలో 65వ నెంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కేతేపల్లి ఎస్సీ కాలనీకి చెందిన మనిమద్దె రాజు స్థానిక ఎస్సీ కాలనీ వద్ద గల జంక్షన్ వద్ద మోటార్ సైకిల్‌పై హైవేను దాటుతుండగా హైదరాబాద్ వైపు నుంచి ఖమ్మం జిల్లా వైరాకు వేగంగా వెళుతున్న కారు ఢీకొట్టింది. దీంతో మోటార్ సైకిల్‌పై ఉన్న రాజు ఎగిరి దూరంగా పడిపోయాడు. ఈప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాజును చికిత్స కొరకు నకిరేకల్ ఏరియా ఆసుపత్రికి, అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్య సేవలకై నల్లగొండ జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. కాగా ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాజు తండ్రి మనిమద్దె అంతయ్య ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందాడు.

ప్రకృతి వినాయకులపై పట్టింపేదీ?

● కానరాని బంకమట్టి గణనాథులు
● పీవోపీ విగ్రహాలపై మక్కువ చూపుతున్న నిర్వాహకులు
● మొక్కుబడిగా మట్టి గణపతుల విగ్రహాల పంపిణీ

పర్యావరణాన్ని పరిరక్షించాలన్న స్పృహ రానురాను యువకుల్లో తగ్గుతోంది. ప్రభుత్వాలు ఎంత ప్రచారం చేస్తున్నా ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను వినియోగిస్తున్నారే తప్ప మట్టి గణనాథులపై మొగ్గు చూపడం లేదు. పీవోపీ విగ్రహాలతో వాతావరణ కాలుష్యంతోపాటు మానవ జాతి మనుగడకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని పర్యావరణవేత్తలు పేర్కొంటున్నా పెడచెవిన పెడుతున్నారు. నేటి నుంచి ప్రారంభమయ్యే గణపతి ఉత్సవాల్లో మట్టిగణపతులను ప్రతిష్ఠించాలని కోరుతున్నారు.

● సూర్యాపేటటౌన్

వినాయక చవితి వచ్చిందంటే వాడవాడలా చిన్న, పెద్ద తేడా లేకుండా విగ్రహాలను నెలకొల్పి పూజలు నిర్వహిస్తుంటారు. అయితే ఈ విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు బంకమట్టి విగ్రహాలకంటే పీవోపీ విగ్రహాలపైనే మక్కువ చూపుతున్నారు. మానవ మనుగడకే ముప్పు కలిగించే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి వాతావరణాన్ని కలుషితం చేస్తున్నారు. వినాయకచవితి అంటేనే ప్రజల్లో ఒక రకమైన ఆనందం నెలకొంటుంది. పిల్లల నుంచి పెద్దల వరకు పండుగను తొమ్మిది రోజుల పాటు ఉత్సాహంగా జరుపుకునేందుకు ఎంతో ఆసక్తి కనబర్చుతారు. పల్లెల నుంచి పట్టణాల వరకు ప్రతీ వీధిలో గణేష్ విగ్రహాలను నెలకొల్పడం ఆనవాయితీగా వస్తుంది. ఈ పండుగను ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. గణేష్ విగ్రహాలను ఏర్పాటుచేసి నవరాత్రోత్సవాలు నిర్వహిస్తారు. కానీ గణేష్ విగ్రహాలను ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చేసినవి ఎక్కువగా నెలకొల్పుతున్నారు. వీటివల్ల పర్యావరణ పరిరక్షణకు ఎంతో హానీ కలుగుతుంది. అందుకోసం బంకమట్టితో తయారుచేసిన విగ్రహాలుఅయితే ఎంతో మేలు. గతంలో ప్రభుత్వం నుంచే బంకమట్టితో తయారు చేసిన విగ్రహాలను అందించేందుకు చర్యలు చేపట్టారు. దీని ద్వారా పీవోపీ విగ్రహాలను తగ్గించి పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చనే భావనతో మట్టి విగ్రహాల పంపిణీ చేస్తారు.

పీవోపీ విగ్రహాలతో ముప్పు

ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలవల్ల ముప్పు వాటిల్లనుంది. పీవోపీ విగ్రహాలు పలు రసాయన పదార్థాలతో తయారు చేస్తారు. అందులో జిప్సం, సల్ఫర్, ఫాస్పరస్, మెగ్నీషియం, మెర్క్యూరీ, కాడ్మియం, ఆర్సెనిక్, కార్బన్ వంటి హానికరమైన రసాయనాలతో వినాయక విగ్రహాలను తయారు చేస్తున్నారు. దీంతోపాటు పలు రకాల రంగులను కూడా వేస్తారు. ఈ విగ్రహాలను తొమ్మిది రోజులపాటు పూజించి అనంతరం చెరువులు, కాల్వల్లో వేసినపుడు జల కాలుష్యం ఏర్పడుతుంది. దీని ద్వారా జలచరాలు మృత్యువాతపడనున్నాయి. అంతేకాక భూగర్భ జలాలు కలుషితమవుతాయి. చేపలు, జంతువులు, ఆ నీటిని తాగడం వల్ల వాటిని తినడం వలన ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. ప్రజలకు ఎక్కువగా ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

బంకమట్టి విగ్రహాలతో ప్రయోజనం

బంకమట్టితో తయారు చేసిన గణేష్ విగ్రహాల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. మట్టి విగ్రహాలు కావడంతో వాతావరణ కాలుష్యం ఉండదు.



సూర్యాపేటలో ఏర్పాటు చేయనున్న బంకమట్టి విగ్రహం

మట్టితో తయారు చేసిన విగ్రహాలు కావడంతో పూజల అనంతరం నీటిలో నిమజ్జనం చేసిన అనంతరం త్వరగా కరిగిపోనున్నాయి. ఈ విగ్రహాల తయారీలో ఎలాంటి రసాయన పదార్థాలు ఉపయోగించకపోవడంతో జల కాలుష్యం ఏర్పడదు. జిల్లాలో బంకమట్టి విగ్రహాలను నెలకొల్పేందుకు భక్తులు అంతగా ఆసక్తి చూపడంలేదు.

సూర్యాపేట జిల్లా కేంద్రంలో మట్టి విగ్రహాల తయారీ

గతంలో ఎన్నడూలేని విధంగా గత సంవత్సరం నుంచి మట్టి విగ్రహాలను జిల్లా కేంద్రంలోనే తయారుచేసి విక్రయిస్తున్నారు. కోల్‌కతా నుంచి వచ్చిన కళాకారులు అక్కడి గంగా మట్టితో తీరొక్క ఆకృతులతో వినాయక విగ్రహాలు తయారుచేసి విక్రయిస్తున్నారు. గత సంవత్సరం ఏర్పాటు చేసినా, నాడు ఎవరూ అంతగా ఆసక్తి చూపకపోవడంతో విగ్రహాలు అంతగాపోలేదు. అయితే ప్రస్తుతం మట్టి విగ్రహాలు కొనుగోలు చేయడానికి నిర్వాహకులు ఆసక్తి చూపారని తెలుస్తోంది.

బంకమట్టి విగ్రహాల పంపిణీకి చర్యలు

వినాయక చవితి సందర్భంగా పీవోపీ విగ్రహాలను నెలకొల్పడాన్ని తగ్గించేందుకు మునిసిపాలిటీల ఆధ్వర్యంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సహకారంతో విగ్రహాలను పంపిణీచేస్తున్నారు. అయితే సూర్యాపేట మునిసిపాలిటీలో ఐదు ఫీట్ల మట్టి విగ్రహాలు వార్డుకు రెండు చొప్పున 48 వార్డులకు కలిపి 96తోపాటు మరో నాలుగు కలిపి మొత్తం 100 విగ్రహాలను పంపిణీచేశారు. జిల్లాలోని కొన్ని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు చిన్న బంకమట్టి విగ్రహాలను పంపిణీచేస్తున్నారు. ఇప్పటివరకు జిల్లాలో ఐదు ఫీట్లకుపైగా మొత్తం విగ్రహాలు 2,300కి పైగా ఏర్పాటు చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి. గణేష్ నవరాత్రోత్సవాల సందర్భంగా భక్తులు పీవోపీతో తయారు చేసిన విగ్రహాలను నెలకొల్పడం వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుంది. విగ్రహాలను చెరువులు, కాల్వల్లో నిమజ్జనం చేస్తే జలకాలుష్యమవుతుంది.

ఎం.నరేందర్‌కుమార్, గ్రీన్‌క్లబ్ ట్రస్టు సభ్యుడు, సూర్యాపేట

పర్యావరణాన్ని ప్రేమించండి..

నాడు కరవు.. నేడు ముంపు. ఏమిటి ఈ ప్రకృతి వైపరీత్యాలు. ఎందుకు ఇన్ని మార్పులు.. కాలం ఎటుపోతుంది.. స్వామి. నువ్వే కాపాడాలి.. ఈ ఏడాదయినా కాలం కలిసొచ్చేలా చూడు స్వామి.. భక్తా అంతా దేవుడి మీద భారం వేస్తే ఎట్లా చెప్పు.. మీకు బాధ్యత లేదా భక్తా.. మీ స్వార్థం కోసం మీరు పర్యావరణాన్ని నాశనం చేస్తుంటే ఏ దేవుడు మాత్రం ఏం చేయగలడు.. చెప్పు భక్తా.. వినాయక చవితి సందర్భంగా దేవుడు భక్తుని మధ్య సంభాషణ..

● మిర్యాలగూడ (వ్యవసాయం)



భక్తుడు: స్వామి ప్రతి ఏటా మీకు నవరాత్రులు వైభవంగా చేస్తున్నాం కదా?

దేవుడు: మీరు పండుగలు సంప్రదాయ పద్ధతిన చేస్తున్నారా భక్తా.. నా రూపాన్ని పర్యావరణహితమైన మట్టితో చేస్తున్నారా.. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చేసి రసాయనిక రంగులు పూస్తున్నారు. ఇది ఎంత ప్రమాదం.. తెలుసా.. నిమజ్జనాలతో స్వచ్ఛమైన జలాశయాలను కలుషితం చేస్తున్నారు. ఆ నీళ్లు తాగి జీవరాశులు మృత్యువాత పడుతున్నాయి.. పంటలు దెబ్బతింటున్నాయి.. తెలుసా మీకు..

భక్తుడు: ఎవరికి వారు గొప్పగా నవరాత్రులు చేయాలనే ఆలోచనతో సంప్రదాయాన్ని మరిచిపోతున్నాం. ఒకప్పుడు మట్టితో చేసిన విగ్రహాలను పెట్టేవాళ్లం.. ప్రస్తుతం 10 శాతం ఆ విగ్రహాలు ఉండటం లేదు స్వామి.. ఎంత అవగహన కల్పించినా పరిస్థితుల్లో పెద్దగా మార్పు లేదు స్వామి..

దేవుడు: భక్తా మీరు మారకపోతే బవిష్యత్ అంధకారమే.. ఇక ప్రకృతి వైపరీత్యాలు అంటవా.. అదీ మీ పొరపాటే.. అభివృద్ధి పేరిట అడవులు నరికేస్తున్నారు.. ఇప్పటికే 70శాతం అడవులు కనుమరుగయ్యాయి.. రుతువులు మారిపోయాయి. అతివృష్టి, అనావృష్టి తప్ప కాలం గమనం ఏనాడు సరిగా లేదు.. వానా కాలంలో ఎండా కాలం ఇది నేటి పరిస్థితి.. చెరువులు కుంటలు, వాగులు ఆక్రమించి ఆనవాళ్లు లేకుండా చేశారు. ఊర్లన్నీ మునుగుతున్నాయి.

భక్తుడు: నిజమే స్వామి మీరు చెప్పింది. మాకు బాధ్యత లేకపోవడంతోనే పర్యావరణం దెబ్బతింటుంది. మీ మీద భారం వేయడం సరైంది కాదు.

దేవుడు: భక్తితోపాటు పర్యావరణాన్ని ప్రేమించడం నేర్చుకోండి.. భక్తా.. అపుడే ప్రకృతి శాంతిస్తుంది.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. సూర్యాపేట జిల్లాలో రోడ్డు ప్రమాదంలో ఇద్దరు, యాదాద్రి భువనగిరి జిల్లాలో అగ్ని ప్రమాదంలో మరొకరు మృత్యువాత పడ్డారు.

చివ్వెంల, సెప్టెంబరు 6: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. సూర్యాపేట జిల్లా మండల పరిధిలోని వల్లాబాపురం గ్రామ శివారులో చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూర్(ఎస్) మండలం పాత సూర్యాపేట గ్రామానికి చెందిన కుంచం పాపయ్య(44) కోదాడ శివారులో గల ఓ క్రషర్ మిల్లులో పనిచేస్తున్నాడు. శుక్రవారం స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వస్తుండగా విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళుతున్న కారు పాపయ్య బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పాపయ్య సోదరుడు శంభయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పాపయ్యకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

భూదాన్‌పోచంపల్లి: యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లిలోని నారాయణగిరి సమీపంలోని మాస్‌ప్యాక్ కంపెనీలో గురువారం రాత్రి 10.30 గంటల సమయంలో జరిగిన ప్రమాదంలో మంటలు వ్యాపించి అందులో పనిచేస్తున్న కార్మికుడు బిషల్ రాయ్(19)కు తీవ్ర గాయాలయ్యాయి. అకస్మాత్తుగా గదిలో మంటలు రావడంతో అతనికి గాయాలు కాగా, చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై అతడి సోదరుడు బికిరాయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. కాగా, మృతుడు బిషల్ రాయ్, అసోం రాష్ట్రం హైలకండి జిల్లా అయినఖల్ గ్రామానికి చెందినవ్యక్తిగా గుర్తించారు.

మోతె: ఇటీవల కురిసిన వర్షాలకు ఏర్పడిన గుంతల్లో బైక్ పడడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ యాదవేందర్‌రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడువాయి గ్రామానికి చెందిన కొచ్చెర్ల శ్రీనివాస్ (45) సూర్యాపేట ఆర్టీసీ డిపోలో ప్రైవేట్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 1న సూర్యాపేటలో విధులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వెళుతుండగా ఉర్లుగొండ-నర్సింహాపురం గ్రామాల మధ్య ఉన్న పాలేరు బ్రిడ్జి మీద నుంచి వెళుతుండగా బ్రిడ్జివెంట ఉన్న గోతు కనిపించకపోవడంతో అందులోపడి పల్టీ కొట్టింది. తలకు తీవ్ర గాయాలుకావడంతో స్థానికులు ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఈ నెల 30న కూడా నేరేడువాయి నుంచి సూర్యాపేటకు ఉదయం డ్యూటీకి వెళుతుండగా గ్రామశివారులో ఉన్న వాగులో బైక్‌తో సహ కొట్టుకుపోయాడు. బైక్‌ను వదిలి బయటకొచ్చాడు. శ్రీనివాస్‌కు ముగ్గురు పిల్లలు, భార్య ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



శ్రీనివాస్(ఫైల్)

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



కుట్టు శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి టౌన్, సెప్టెంబరు 6: మహిళలు ఆర్థికాభివృద్ధిని సాధించాలని ఇందుకు ప్రభుత్వం సహకరిస్తుందని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం భువనగిరిలో ఆయన మహిళా సాధికారత భవనాలను, మెప్మా ఇందిరా మహిళా శక్తి స్కీంలో భాగంగా మహిళా సంఘాలు ఏర్పాటు చేసిన శ్రీ దుర్గా క్యాంటీన్‌ను శుక్రవారం భువనగిరిలో ఆయన వేర్వేరుగా ప్రారంభించి మాట్లాడారు. రూ.4.20లక్షల వ్యయంతో మహిళా సంఘాలే క్యాంటీన్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మహిళా సాధికారత భవనాల్లో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని పరిశీలించి, మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా భువనగిరి మునిసిపాలిటీ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను ఆయన పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, కమిషనర్ పి రామాంజులరెడ్డి, కౌన్సిలర్లు పోత్నక్ ప్రమోద్‌కుమార్, పడిగెల రేణుకా ప్రదీప్, మాజీ చైర్మన్ బర్రె జహంగీర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు కలలను సాకారం చేసుకోవాలి



వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పిస్తున్న సైక్రియాటిస్టు ప్రీతిస్వరూప్

మోత్కూరు, సెప్టెంబరు 6: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ఇష్టంతో కష్టపడి చదివి తమ కలలు సాకారం చేసుకోవాలని ప్రముఖ సైక్రియాటిస్టు డాక్టర్ ప్రీతిస్వరూప్ అన్నారు. శుక్రవారం మోత్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కుటుంబ ఆరోగ్య శాఖ, బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన వ్యక్తిత్వ వికాస అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎస్ఎస్‌సీ పూర్తయ్యాక విద్యార్థులు కౌమారదశలో ఇంటర్‌లోకి వెళతారని, ఉన్నత శిఖరాలకు చేరాలన్నా, పతనం అంచుల్లోకి వెళ్లాలన్నా ఇంటర్ కీలక దశ అని అన్నారు. విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లో ఒత్తిడికి లోనుకావద్దన్నారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే జీవితం శూన్యమవుతుందని ఆయన హెచ్చరించారు. మానసిక ఒత్తిడికిలోనైతే 14416 నంబరులో సంప్రదించి తగిన సలహాలు, సూచనలు పొందవచ్చన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రభజస్టీస్ అధ్యక్షతన జరిగిన సదస్సులో స్టూడెంటు మెంటల్ హెల్త్ కౌన్సిలర్ సిహెచ్.అంజయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కడారు నర్సింహారెడ్డి, లెక్చరర్లు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీగానే పునరుద్ధరించాలి

భూదాన్‌పోచంపల్లి, సెప్టెంబరు 6 : గతంలో గ్రామపంచాయతీగా ఉన్న భూదాన్‌పోచంపల్లిని ఐదేళ్లక్రితం మున్సిపాలిటీగా మార్చారని, దీంతో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, పోచంపల్లిని తిరిగి గ్రామపంచాయతీగానే పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని కోరుతూ శుక్రవారం పట్టణంలోని అఖిలపక్షం నాయకులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తడక వెంకటేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు భారత లవకుమార్, నాయకులు మెరుగు యతినందం, అంకం పాండు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్నం శివకుమార్, నాయకులు ఏలె శ్రీనివాస్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సీత వెంకటేష్, నాయకులు చిట్టిపోలు శ్రీనివాస్, సీత శ్రవణ్, కొంక లక్ష్మీనారాయణ, పద్మశాలి మహాజన సంఘం అధ్యక్షులు డాక్టర్ సీత సత్యనారాయణ, సీత కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మొల్ల విగ్రహం ఏర్పాటుకోసం రూ.లక్ష విరాళం

సంస్థాన్ నారాయణపురం, సెప్టెంబరు 6: మండల కేంద్రంలో శాలివాహన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మొల్ల విగ్రహం కోసం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి గతంలో లక్ష రూపాయల విరాళం ప్రకటించారు. విగ్రహం ఏర్పాటు కోసం గతంలో ఇచ్చిన మాట ప్రకారం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి శుక్రవారం లక్ష రూపాయల విరాళాన్ని అందజేశారు. విరాళం డబ్బులను స్థానిక కాంగ్రెస్ నాయకులు ఉప్పల లింగస్వామి శాలివాహన సంఘం సభ్యులకు అందజేశారు. లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించిన ఎమ్మెల్యేకు శాలివాహన సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఉప్పల లింగస్వామి, మందుగుల బాలకృష్ణ, ఏపూరి సతీష్, కొండ్రెడ్డి నరసింహ, రాసమల్ల యాదయ్య, కురుమిద్దె గోపాల్, జక్కలి విక్రమ్, రాచకొండ రమేష్ బాబు పాల్గొన్నారు.

బైరు మల్లయ్య ఆశయాలను కొనసాగించాలి

వలిగొండ, సెప్టెంబరు 6: స్వాతంత్ర్య సమరయోధుడు బైరు మల్లయ్య ఆశయాలను కొనసాగించాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు మాటూరి బాలరాజు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో కల్లుగీత కార్మిక సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో బైరు మల్లయ్య నాలుగో వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య, గాజుల ఆంజనేయులు, మండల ప్రధాన కార్యదర్శి పల్సం స్వామి, సత్తయ్య పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలు ప్రారంభం

భువనగిరి అర్బన్, సెప్టెంబరు 6: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలో సీట్లు కేటాయించని అభ్యర్థుల కోసం ప్రవేశాలు ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ హరికృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 5 నుంచి 20 వరకు వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. ఇప్పటికే మొదటి, రెండవ, మూడవ విడతలో నమోదు చేసుకున్న అభ్యర్థులు తిరిగి నమోదు చేసుకోవద్దని, అభ్యర్థులు ప్రింటెడ్ దరఖాస్తులతో పాటు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో వాక్-ఇన్ అడ్మిషన్లకు ఈ నెల 11 నుంచి 20 వరకు ఉదయం 11గంటలకు హాజరు కావాలని కోరారు. వివరాల కోసం 9866843920ను సంప్రదించాలని కోరారు.

చేనేత కార్మికుల జీవనస్థితిగతులపై అధ్యయనం

భూదాన్‌పోచంపల్లి, సెప్టెంబరు 6: చేనేత కార్మికుల జీవన స్థితిగతులపై అధ్యయనం చేసేందుకు హైద్రాబాద్‌లోని బేగంపేట్ ప్రాంతానికి చెందిన సెయింట్ ఫ్రాన్సిస్ డిగ్రీ కాలేజీ మొదటి సంవత్సరం చదువుతున్న 80 మంది విద్యార్థులు శుక్రవారం భూదాన్‌పోచంపల్లిని సందర్శించారు. ఈ సందర్భంగా చేనేత కార్మికుల ఇళ్లను సందర్శించి చేనేత కార్మికుల కళాత్మక నైపుణ్యాన్ని అభినందించారు. చేనేత కార్మికులు జీవన స్థితిగతులను, ప్రభుత్వ పరంగా అందుతున్న ప్రోత్సాహకాలను, ఉపాధి అవకాశాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాలేజీ ఫ్యాకల్టీ శిరీష, ప్రతినిధి జాకబ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి దివీస్ చేయూత

చౌటుప్పల్ రూరల్, సెప్టెంబరు 6: విద్యాభివృద్ధికి దివీస్ చేయూత అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చిన్నకొండూర్ జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దివీస్ ల్యాబొరేటరీస్ ఆధ్వర్యంలో రూ.2.76లక్షల విలువైన నోట్ బుక్స్, స్కూల్ బ్యాగ్‌లు, వాటర్ బాటిల్స్, శాండిల్స్ అందజేశారు. కార్యక్రమంలో రాములు, జయమ్మ, క్రాంతి కుమార్‌స్వామి, శైలజ, సాయికృష్ణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


100పడకల ఆసుపత్రిని మంజూరు చేయించాలి

ఆలేరు రూరల్, సెప్టెంబరు 6: పట్టణంలో 100 పడకల ఆసుపత్రిని ఏర్పాటు ఏర్పాటు చేయించాలని పీవైఎల్ జిల్లా కార్యదర్శి బేజాడి కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆలేరులో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత పాలకులు చేసిన పొరపాట్లు చేయకుండా స్థానిక ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఆలేరును వంద పడకల ఆసుపత్రిగా మార్చాలన్నారు.

సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులు

మోత్కూరు, సెప్టెంబరు 6: ఉపాధ్యాయులు సమాజ నిర్మాతలని రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం రెడ్‌క్రాస్ సొసైటీ, జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సూరోజు భాస్కరాచారి, యాదమ్మ దంపతులు వారి తండ్రి సూరోజు తిరుపతయ్య, కుమారుడు రవికుమార్ జ్ఞాపకార్థం మండలంలోని బుజిలాపురం గ్రామంలో నిర్వహించిన గురుపూజోత్సవంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా హెచ్ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు నర్సింహారెడ్డి, రవి, కరుణాకర్, భవాని, జి.వెంకటేశ్వర్లు, ఎ.వెంకటేశ్వర్లు, వాణి సన్మానించారు. కార్యక్రమంలో జె.సుబ్రమణ్యశర్మ, జహంగీర్, ఎం.మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్ధనారీశ్వర అలంకరణలో పెద్దమ్మ తల్లి



అర్ధనారీశ్వర అలంకరణలో పెద్దమ్మ తల్లి

మోత్కూరు, సెప్టెంబరు 6: మోత్కూరు పెద్దమ్మ తల్లి ఆలయంలో పెద్దమ్మతల్లి శుక్రవారం అర్ధనారీశ్వర (సగం పార్వతి, సగం శంకరుని) రూపంలో దర్శనమిచ్చింది. పూజారి పారునంది లక్ష్మణమూర్తి పెద్దతల్లిని అర్ధనారీశ్వర రూపంలో అలంకరించడంతో పాటు, నల్లనువ్వులు, అప్పడాలతో వినాయకుని విగ్రహాన్ని అలంకరించి పెద్దతల్లి ఆలయంలో ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా కుంకుమ పూజ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వెళ్లి పెద్దమ్మతల్లికి, వినాయకునికి నిర్వహించిన పూజల్లో పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠించాలి

భువనగిరి టౌన్, సెప్టెంబరు 6: మట్టి వినాయక విగ్రహాలనే ప్రతిష్ఠించి పూజించాలని అదనపు కలెక్టర్ గంగాధర్ అన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం భువనగిరిలో ఆయన మట్టి విగ్రహాల పంపిణీని ప్రారంభించి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. గణేష్ మండపాల్లో ప్లాస్టిక్ వస్తువులను వినియోగించరాదని సూచించారు. నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి యాదయ్య, కుమ్మరి శాలివాహన సంఘం మాస్టర్ ట్రైనర్ సీహెచ్ కృష్ణ పాల్గొన్నారు.



వలిగొండలో మట్టివిగ్రహాలను పంపిణీ చేస్తున్న ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

వలిగొండ: మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బాశెట్టి శ్రీధర్ సౌజన్యంతో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు బచ్చు శ్రీనివాస్ మాట్లాడుతూ, హానికరమైన రసాయన పదార్థాలతో తయారు చేసిన వినాయక విగ్రహాలను పూజించవద్దన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు బాదం పాండు, గజ్జెల అమరేందర్, బాశెట్టి మనోహర్, గజ్జెల శ్రీధర్, అపిశెట్టి సంతోష్, చీకటిమల్ల హరిబాబు, రేగురి అమరేందర్, బెలిద లవకుమార్, రాజు పాల్గొన్నారు.

ఆలేరు రూరల్ : పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరు మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు నిర్వహించాలని ఎన్‌సీసీ అధికారి దూడల వెంకటేష్ అన్నారు. స్థానిక జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ ఆధ్వర్యంలో మట్టి వినాయకులను పంపిణీ చేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నరేంద్రస్వామి, పరమేశ్వర్, స్వర్ణలత, హేమలత, తిరుపతి ఉన్నారు.

చౌటుప్పల్ టౌన్: పట్టణంలో భారత్ సేవా సహకార ఫోరం ఆధ్వర్యంలో ప్రజలకు ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ కె.నర్సింహారెడ్డి, ఫోరం సభ్యుడు బొబ్బిళ్ల మురళి, కౌన్సిలర్ బొడిగె అరుణా బాలకృష్ణ, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కె. చంద్రశేఖర్, ట్రినిటీ హైస్కూల్ ప్రిన్సిపాల్ మంజుల, పస్తం గంగరాములు, ఎంఎస్.గౌడ్, లింగస్వామి, శ్రీశైలం పాల్గొన్నారు.

● చౌటుప్పల్ పట్టణంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారి శ్వేత ప్రియాంక, చిన్న పిల్లల వైద్య నిపుణులు ఎ. శ్రీనివాస్ ప్రసాద్, దంత వైద్య నిపుణులు నీరజ దేవి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కొసనం రామ్ రెడ్డి, దాచెపల్లి ప్రకాష్ పాల్గొన్నారు.

● చౌటుప్పల్ పట్టణంలోని మల్లికార్జున హైస్కూల్‌లో ముందస్తుగా గణేష్ ఉత్సవాలను నిర్వహించారు. పండుగను పురస్కరించుకుని శివుడిగా జెక్కర్తి రక్షిత, పార్వతిగా గోసుల ఐశ్వర్య, వినాయకుడిగా మార్గం ఆరాధ్య వేషధారణ చేశారు. స్కూల్ ప్రిన్సిపాల్ దేవీరావు ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలను నిర్వహించారు.

ఆత్మకూరు(ఎం) : వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండలంలోని కొరటికల్ హైస్కూల్‌లో విద్యార్థులు మట్టి విగ్రహాలను తయారు చేశారు. ప్రతీ ఒక్కరు పర్యావరణాన్ని పరిరక్షించాలని ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచించారు.



భువనగిరిలో మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న అదనపు కలెక్టర్ గంగాధర్

భువనగిరిరూరల్: బీబీనగర్ మండలకేంద్రంలో గణేశ్ నవరాత్రులను పురస్కరించుకుని టైగర్ చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు పంజాల సురేష్‌గౌడ్ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. మల్లగారి శ్రీనివాస్, పంజాల వెంకటేశ్ గౌడ్, లాలయ్య గౌడ్, గోపాల్ పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట రూరల్: వినాయక చవితి పురస్కరించుకుని పట్టణంలో వాడవాడల గణేశ్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు గణేష్ మండపాలను తీర్చిదిద్దారు. మండపాల్లో విద్యుత్ కాంతులతో ముస్తాబు చేశారు.



ఆత్మకూరు(ఎం): కొరటికల్ హైస్కూల్లో మట్టి గణపతులను తయారు చేసిన విద్యార్థులు



చౌటుప్పల్‌లోని మల్లికార్జునపాఠశాలలో చిన్నారుల వేషధారణ

గోదావరి జలాల సాధనకోసం పోరాటం



వలిగొండ: సదస్సులో మాట్లాడుతున్న బాలరాజు

వలిగొండ, సెప్టెంబరు 6: మూసీ ప్రక్షాళన, బునాదిగాని, భీమలింగం కాల్వల ద్వారా గోదావరి జలాల సాధనకోసం పోరాటాలను నిర్వహించాలని మూసీ ప్రక్షాళన గోదావరి జలాల సాధన వేదిక జిల్లా కన్వీనర్ మాటూరి బాలరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ ప్రాంగణంలో మూసీ ప్రక్షాళనపై ప్రాంతీయ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 ఏళ్ల క్రితం స్వచ్ఛమైన నీటిని అందించిన మూసీ నేడు కాలుష్యంగా మారిందన్నారు. ఈ మూసీ ప్రాంతంలో ఉన్న గ్రామాల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. మూసీ ప్రక్షాళన కోసం ప్రభుత్వం వెంటనే నిధులు కేటాయించి ప్రజల ప్రాణాలను కాపాడాలని డిమాండ్ చేశారు. పరిశ్రమల నుంచి వెలువడుతున్న రసాయనాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా గౌరవ సలహాదారులు ఎండీ.జహంగీర్, బట్టు రాంచంద్రయ్య, జిల్లా కో కన్వీనర్ సిర్పంగి స్వామి, కొండమడుగు నర్సింహ, కల్లూరి మల్లేశం, మేక అశోక్‌రెడ్డి, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోమటిరెడ్డి చంద్రరెడ్డి, జిల్లా నాయకులు మద్దెల రాజయ్య, నర్సింహ, వెంకటేశ్, వెంకటనర్సు, శ్రీనివాస్, బిక్షం, సురేందర్, శ్రీశైలంరెడ్డి పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : అసంపూర్తిగా ఆగిపోయిన బునాదిగాని కాల్వ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 10 నుంచి 11 వరకు చేపట్టనున్న బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని మూసీ ప్రక్షాళన-ప్రత్యామ్నాయ గోదావరి జలాల సాధన వేదిక జిల్లా కో-కన్వీనర్, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కల్లూరి మల్లేశం ప్రజలకు పిలుపునిచ్చారు. ఈమేరకు శుక్రవారం మండలంలోని కూరెళ్ల గ్రామంలో బైక్‌ర్యాలీ కరపత్రాలను విడుదల చేశారు. కాల్వ పనులు త్వరగా పూర్తి చేసి బస్వాపురం ప్రాజెక్టు ద్వారా అనుసంధానం చేసి, గోదావరి జలాలు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బైక్ ర్యాలీలో రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి వేముల బిక్షం, నాయకులు రచ్చ గోవర్ధన్, బి.రాములు, టి.సత్యనారాయణరెడ్డి, బీరయ్య, చంద్రయ్య, ఎల్లయ్య, సత్తయ్య, సాయిలు, నరసయ్య పాల్గొన్నారు.

గణేష్ నవరాత్రుల సందడి



పూజా సామగ్రిని కొనుగోలు చేస్తున్న భక్తులు

భువనగిరి టౌన్, సెప్టెంబరు 6: నవరాత్రి ఉత్సవాల ప్రారంభం సందర్భంగా కొన్ని రోజులుగా భువనగిరి పట్టణంతో పాటు పలు ప్రాంతాల్లో నవరాత్రుల సందడి నెలకొన్నది. వినాయక విగ్రహాలు, పూజా సామాగ్రి కొనుగోళ్లతో శుక్రవారం భువనగిరి పట్టణ ప్రధాన రహదారి కిక్కిరిసింది. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. పండ్లు, పూల ధరలకు రెక్కలు వచ్చాయి. మండపాల నిర్వాహకులు తమ ప్రాంతాల్లో ఇళ్లిల్లు తిరుగుతూ చందాలు సేకరిస్తున్నారు. నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా కొనసాగేలా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. డాగ్, బాంబ్ స్క్వాడ్‌తో మండపాల్లో తనిఖీలు చేస్తున్నారు. నవరాత్రుల పాటు మండపాల నిర్వాహణలో నిర్వాహకులు పూర్తి స్థాయి జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

నవరాత్రి వేడుకల పేరిట పలువురికి ఉపాధి

గణేష్ నవరాత్రి ఉత్సవాలు కేవలం ఆధ్యాత్మికతకే పరిమితం కాకుండా పలువురికి ఉపాధి కూడా లభించనుంది. నవరాత్రుల పాటు నిత్య పూజల రూపకంలో అర్చకులకు, మండపాల నిర్మాణం, సుందరీకరణ పేరిట కూలీలకు, కళాకారులకు, ఎలక్ట్రీషియన్స్ వంట కార్మికులకు, మైక్ సౌండ్స్, రవాణా వాహనాలకు, డప్పు, బ్యాండ్, కోలాటం, సాంస్కృతిక ప్రదర్శనల కళాకారులకు, వినాయక విగ్రహాల తయారీ దారులతోపాటు పలువురికి ఉపాధి లభించనుంది. కిరాణం, పండ్లు, పువ్వులు, వస్త్ర, అలంకరణ సామాగ్రి దుకాణాలు, స్వీట్ హౌజ్‌లలో విక్రయాలు పెరుగనున్నాయి.

పథకాలపై అవగాహన పెంపొందించుకోవాలి

భువనగిరి టౌన్, సెప్టెంబరు 6: మహిళా భద్రత, సాధికారతకు ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా మహిళా సాధికారత కేంద్రం మిషన్ కోఆర్డినేటర్ కె.పూర్ణ అన్నారు. శుక్రవారం భువనగిరిలోని తారకరామానగర్, తాతానగర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో వేర్వేరుగా నిర్వహించిన వంద రోజుల సంకల్ప్ సమావేశంలో ఆమె మాట్లాడారు. అంగన్ వాడీ కేంద్రాల నిర్వాహణలో జాగ్రత్తలు పాటించాలని అన్నారు. ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేసి పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో జెండర్ స్పెషలిస్ట్ భార్గవి, ఫైనాన్సియల్ లిటరసీ మనీషా అంగన్‌వాడీ టీచర్లు భాగ్య, బాలమణి పాల్గొన్నారు.

పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరుచేయాలి

ఆలేరు రూరల్, సెప్టెంబరు 6: అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని సీపీఐ జిల్లా నాయకులు చెక్క వెంకటేష్ అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యావసర ధరలను నియంత్రించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కనకయ్య, ప్రవీణ్, పరుశరాములు, సరళ, శ్రీను ఉన్నారు.

ఎంపీడీవోగా నిరంజన్ బాధ్యతల స్వీకరణ

మోత్కూరు, సెప్టెంబరు 6: మోత్కూరు ఎంపీడీవో ఎండి.నిరంజన్ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. వలిగొండ మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న ఆయన బదిలీపై మోత్కూరు ఎంపీడీవోగా వచ్చారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఇన్‌చార్జి ఎంపీడీవోగా పనిచేసిన శంకరయ్యకు వీడ్కోలు పలికి, నిరంజన్‌కు స్వాగతం పలికి సన్మానించారు.

అక్రమ పట్టాలను రద్దు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న గ్రామస్థులు

గుండాల, సెప్టెంబరు 6: గుండాల మండలం సీతారాంపురం గ్రామంలోని ఎర్రబోళ్ల వద్ద ఉన్న ప్రభుత్వ భూమిలో కొందరికి ఇచ్చిన అక్రమ పట్టాలను రద్దు చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమకు పట్టాలు ఇచ్చిందని తెలుపుతూ గ్రామానికి చెందిన కొంత మంది వ్యక్తులు శుక్రవారం ఎక్స్‌కవేటర్‌తో భూమిని సేద్యం చేస్తుండడంతో భూమి లేని నిరుపేదలకు భూమి ఇవ్వకుండా భూమి ఉన్న వారికి ప్రభుత్వ భూమిని ఎలా ఇస్తుందని పలువురు ప్రశ్నించారు. అక్రమ పట్టాలను రద్దు చేయాలని గ్రామస్థులు ఆందోళన చేసి ఎక్స్‌కవేటర్‌ను అడ్డుకుని రెవెన్యూ, పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అధికారులు పనులు నిలిపివేయించారు. తమకు గత 20 సంవత్సరాల క్రితం ప్రభుత్వం భూమి ఇచ్చిందని తమకు ఇచ్చిన భూమిలో సేద్యం చేసుకుంటున్నామని అధికారుల దృష్టికి తీసుకు వెళ్లగా మీ దగ్గర పత్రాలు ఏమి ఉన్నా యో తీసుకుని తహసీల్దార్ కార్యాలయానికి రావాలని తాము చెప్పేంత వరకు భూమిని ఎవరూ సేద్యం చేయొద్దని గ్రామస్థులను అధికారులు ఆదేశించారు. ఈ విషయమై తహసీల్దార్ జల కుమారిని వివరణ కోరగా గ్రామ శివారులోని ఎర్రబోళ్ల సమీపంలో సర్వేనంబర్ 179 లో 75 ఎకరాల 38 గుంటల ప్రభుత్వ భూమి ఉందని 45 ఎకరాల భూమి ప్రభుత్వం తమకు ఇచ్చిందని కొంత మంది అంటున్నారని, రికార్డులు పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

● సీతారాంపురం గ్రామంలోని సర్వేనంబర్ 179లోని ప్రభుత్వ భూమిని భూమి లేని నిరుపేదలకు కేటాయించాలని కోరుతూ శుక్రవారం తహసీల్దార్ జల కుమారికి గ్రామస్థులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ 179 సర్వేనంబర్‌లోని ప్రభుత్వ భూమిని పేదలకు కేటాయించాలని అనేక సార్లు జిల్లా కలెక్టర్‌తో పాటు గతంలో ఉన్న ఎమ్మెల్యేలకు వినతి పత్రాన్ని ఇచ్చామని తెలిపారు. కాగా 45 ఎకరాల భూమి తమకు ఇచ్చారని కొంత మంది అంటున్నారని, వెంటనే అక్రమ పట్టాలను రద్దు చేసి భూమి లేని పేదలకు భూమి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్థులు కూరెళ్ల స్వామి, పాలడ్గు ఉప్పలయ్య, మల్లెపాక సురేష్, మొగిలిపాక వేణు, పాలడ్గు రామ్మల్లయ్య, పాలడ్గు స్వామి, శివరాత్రి ఈదయ్య, నరేందర్, సంజీవ, బక్కయ్య, చంద్రయ్య పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమంలో జిట్టా పాత్ర మరువలేనిది



వలిగొండ: జిట్టా బాలకృష్ణారెడ్డికి నివాళులర్పిస్తున్న నాయకులు

వలిగొండ, సెప్టెంబరు 6: ప్రత్యేక తెలంగాణ మలిదశ ఉద్యమంలో ఉద్యమనేత జిట్టా బాలకృష్ణారెడ్డి పాత్ర మరువలేనిదని పలువురు అన్నారు. మండల కేంద్రంలో పలువురు నాయకులు జిట్టా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మరుగున పడిన తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను మరోసారి గుర్తు చేసిన మహోన్నత నాయకుడు బాలకృష్ణారెడ్డి అని అన్నారు. కార్యక్రమంలో నాయకులు తుమ్మల వెంకట్‌రెడ్డి, శీలం స్వామి, చిలుగూరి సత్తిరెడ్డి, పడమటి దామోదర్‌రెడ్డి, అయిటిపాముల సత్యనారాయణ, ఎండి అఫ్రోజ్, పల్సం రాజు, అయిటిపాముల ప్రభాకర్, కొండూరు వెంకటేశం, సమ్మద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంస్థాన్ నారాయణపురం: తెలంగాణ ఉద్యమకారుడు జిట్టా బాలకృష్ణారెడ్డి మృతి పట్ల కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జక్కలి ఐలయ్య యాదవ్ దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. జిట్టా మరణం తెలంగాణ సమాజానికి తీరని లోటని ఆయన అన్నారు. తెలంగాణ ఉద్యమం కోసం బాలకృష్ణారెడ్డి కోట్లాది రూపాయల ఖర్చు చేశారని పేర్కొన్నారు. నీతి నిజాయితీగా తెలంగాణ కోసం పోరాడిన నాయకుడు జిట్టా అని కొనియాడారు

యాదగిరిగుట్ట రూరల్: తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు జిట్టా బాలకృష్ణారెడ్డి చిత్రపటానికి శుక్రవారం స్థానిక తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ బీఆర్ఎస్ సెక్రటరి జనరల్ పాపట్ల నరహరి, నాయకులు శ్రీధర్ గౌడ్, రామస్వామి, భట్టాచార్యులు, క్రాంతి, వాసు, ఎస్‌కే బాబా, చిరంజీవి, భిక్షపతి, అయిలయ్య తదితరులున్నారు. వంగపల్లి కేసరియూత్ అధ్యక్షులు , టీడీపీ ఆలేరు నియోజకవర్గ కో కన్వీనర్ రేగు బాలనర్సయ్య జిట్టా మృతికి సంతాపం తెలిపారు.

చౌటుప్పల్ రూరల్ : జిట్టా బాలకృష్ణారెడ్డి మృతి తెలంగాణకు తీరని లోటు అని బీఆర్ఎస్ నాయకులు ఉప్పు కృష్ణ అన్నారు. ప్రత్యేక తెలంగాణ సాధన కోసం జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప నాయకుడు బాలకృష్ణారెడ్డి అని కొనియాడారు. యువతకు బాలకృష్ణారెడ్డి జీవితం ఆదర్శమన్నారు. ఫిల్టర్ ప్లాంట్లను ఏర్పాటుచేశారని కొనియాడారు.

మోత్కూరు : తెలంగాణ మలి దశ ఉద్యమకారుల ప్రముఖుల్లో ఒకరైన జిట్టా బాలకృష్ణారెడ్డి మృతి తెలంగాణ సమాజానికి తీరని లోటని బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ అన్నారు.

బాలకృష్ణారెడ్డి మృతి చెందడంతో మోత్కూరు హైస్కూల్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రజల్లో చైతన్యం నింపి తెలంగాణ ఉద్యమాన్ని ఉధృతం చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు నేముల రమేష్, పురుగుల కృష్ణ, అల్లె యాదయ్య, రేవెళ్లి రవిప్రసాద్, రాజు, ముత్తయ్య పాల్గొన్నారు.



మోత్కూరు: జిట్టా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు



యాదగిరిగుట్టలో బాలకృష్ణారెడ్డి ఫ్లెక్సీ వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు